క్లుప్తంగా

కూలీలకు గిరాకీ


రుద్రసముద్రంలో మిర్చి కోస్తున్న కూలీలు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన మిరప పంటలు చేతికి వచ్చే సమయంలో కూలీలకు గిరాకీ ఏర్పడింది. అన్ని గ్రామాల్లో రైతులు ఒకేసారి మిరప కోతలు ప్రారంభించడంతో కూలి ధర రూ.400 నుంచి రూ.500 వరకూ పెరిగింది. రైతులు ఏం చెయ్యాలో తోచక మిరప పంటను అధిక కూలి చెల్లించి మిరపకాయలు కోపిస్తున్నారు. ఎకరా మిరపకాయల కోతకు సుమారు రూ.35 నుంచి రూ.40 వేలు అవుతుందని రైతులు చెప్తున్నారు. పెద్దన్నపాలెం, వెంకటాపురం, భూమనపల్లి, ఇండ్లచెరువు, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి, లక్ష్మీపురం, రుద్రసముద్రం, మంగినపూడి, బసిరెడ్డిపల్లి, పుల్లయిపల్లి, రామాపురం గ్రామాల్లో సుమారు 650 హెక్టార్లలో మిరప పంటపై రైతులు దృష్టి సారించారు. ఇతర మండలాల నుంచి కూలీలు ట్రాక్టర్‌లు, ఆటోల్లో వందల సంఖ్యల్లో వస్తున్నారు. కూలి ధరలు పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గుంటూరు మిర్చి యార్డులో ధర డీలా పడిపోయింది. గతేడాది సుమారు క్వింటా రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది. నేడు క్వింటా రూ.13 వేల నుంచి రూ.14 వేలు మాత్రమే ధర ఉంది. ఈ ఏడాది తెగుళ్ల బెడద, రేటు తగ్గడం రైతన్నలకు భారంగానే ఉందని గ్రామాల్లోని రైతులు వాపోతున్నారు.

9న మోటార్ సైకిళ్ల స్లో పోటీలు

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి సద్గురు యోగానంద నరసింహస్వామి 69వ పుట్ట తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మోటార్ సైకిళ్ల స్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు దాతలు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు స్థానిక కొలుకుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో త్రిపురాంతకం మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో జరిగే ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడతారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మిర్చి కోతల్లో చిన్నారులు

- బంగారు బాల్యం పేరుతో ఉత్తుత్తి ఉత్సవాలు
- పెరిగిపోతున్న బాల కార్మికులు
- పనుల్లేక వలస వెళ్తున్న కూలీలు


మిరప కాయల కోతకు వచ్చిన విద్యార్థులు

కురిచేడు: బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాం..అంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అధికారులు బంగారు బాల్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఉపయోగం ఉండటం లేదు. అధికారులు లెక్కలకే పరిమితం అవుతున్నారు తప్ప వాస్తవ పరిస్థితులపై వారు దృష్టి సారించడం లేదు. ఏ గ్రామంలో చూసినా పనుల్లేక అన్నమో రామచంద్రా..అంటూ కూలీలు వలస బాటపట్టారు. ద్రోణాచలం, అద్దంకి, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో కూలీలు పొట్టచేత పట్టుకుని మిరప కాయల కోతకు మండలానికి వలస వచ్చారు. వారితో పాటు ఎందరో చిన్నారుల బంగారు బాల్యం పొలలకు పరిమితమైంది. అధికారులు బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాం.. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉన్నారంటూ సభలు, సమావేశాలు నిర్వహించి ప్రచారాలకు పరిమితమయ్యారు. మండలంలోని ఓ రైతు మిరప తోటలో చిన్నారులు మిరపకాయల కూలి పనులకు వెళ్లారు. వారిని, వారి తల్లిదండ్రులను పలకరిస్తే ఎన్నో విషయాలు వెల్లడయ్యాయి.

> **తల్లిదండ్రులకు సాయంగా వచ్చా**
> బతుకుదెరువు కోసం తల్లిదండ్రులకు నా వంతు సాయం చేద్దామని భావించా. పనులు ఎక్కువగా ఉండటంతో వచ్చా. పనులు లేని సమయంలో బడికి వెళ్తా. ఆధార్ లేక పోవడంతో బడికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది.
> – తుపాకుల లక్ష్మి

> **ఇల్లు గడవక వలస వచ్చాం**
> ఇల్లు గడవక ఇంటిల్లపాది కడుపు చేతబట్టుకుని పనులకు వచ్చాం. కుటుంబ సభ్యులతో పాటు నేను కూడా రావాల్సి వచ్చింది. ఐదో తరగతి మా ఊర్లో చదువుతున్నా. పనులు అయిపోయి తిరిగి మా ఊరు వెళ్లాక బడికి వెళ్తా.
> – తిరివీధి శివదుర్గ

ఆధార్ లేక తిప్పలు

బడికి రానివ్వక పోవడంతో పిల్లలను పొలం పనులకు తీసుకొచ్చామని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆధార్ కార్డు నమోదు చేయాలంటే కచ్చితంగా జనన ధ్రువీకరణ పత్రం కావాలనేది ప్రభుత్వం నిబంధన. అయితే గ్రామాలకు చివరన ఉంటూ అక్షర జ్ఞానం లేని యానాదులు తమకు ఆధార్ అవసరమని, దానికి జనన ధ్రువీకరణ పత్రం అవసరమవుతుందని, పిల్లలను కన్న వెంటనే ప్రభుత్వ కార్యాలయాల్లో నమోదు చేయించుకోవాలని తెలియని వారు అలాగే ఉండిపోయారు. అవగాహన కలిగించాల్సిన అధికారులు కార్యాలయాలకు పరిమితం కావడంతో చిన్నారుల జీవితం పనులకు పరిమితమైంది. మండుటెండల్లో చిన్నారులు మలమలమాడుతూ ఎన్నో రకాల కెమికల్స్ వాడిన మిరప తోటల్లో వారి బంగారు జీవితాన్ని బలి చేసుకుంటున్నారు. అన్నింటిలో అవకాశాలున్నా ఆధార్ నమోదులో లేదు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు, పథకాలు ప్రవేశ పెడుతోంది. ఆధార్ నమోదులో మాత్రం ఎలాంటి ప్రత్యేక అనుమతి ఇవ్వలేదు. ఆధార్ లేకుండా ఎన్ని పథకాలున్నా ఉపయోగం ఏం ఉందని పేదలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైద్యాధికారి సర్టిఫికెట్‌తో నమోదుకు ప్రత్యేక అనుమతి ఇచ్చి స్పెషల్ డ్రైవ్‌లో అందరికీ ఆధార్ నమోదయ్యేలా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


మిరప కాయలు కోస్తున్న పోట్లూరి ఇందు

> **ఆధార్ లేదని బడికి రానివ్వలేదు**
> బడికి వెళ్దామంటే ఆధార్ కార్డు లేదని బడికి రానివ్వ లేదు. పుట్టిన తేదీ కాగితం అడిగారు. అది కూడా మాకు తెలియదన్నాం. అందుకని నన్ను, మా అన్న వెంకటేశ్వర్లును బడిలో చేర్చుకోమన్నారు. దీంతో పనులకు వెళ్తున్నాం. మాకు ఆధార్ కార్డులిప్పించి బడిలో చేర్పిస్తే చదువుకుంటాం.
> – పోట్లూరి ఇందు

> **మూడు రోజులు ఏడ్చా**
> బడిలో చేర్చుకోమని బడి చుట్టూ, పంతుళ్ల చుట్టూ మా అమ్మను తీసుకెళ్లా. ఆధార్ లేకుండా బడిలో చేర్చుకోమన్నారు. మూడు రోజులు అన్నం తినకుండా ఏడ్చా. అయినా లాభం లేకపోయింది. ఆధార్ లేనందున చదువు కోలేకపోతున్నా. ఆధార్ ఇప్పించి బడిలో చేర్పిస్తే చదువుకుంటా.
> – పోట్లూరి వెంకటేశ్వర్లు

అక్రమ రిజిస్ట్రేషన్‌పై సబ్ కలెక్టర్ దర్యాప్తు


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

యర్రగొండపాలెం: పట్టణంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ స్థలాలపై మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ సోమవారం దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్లు 58, 58/1లో ఉన్న స్థలాలను మండలంలోని సర్వాయపాలేనికి చెందిన దొడ్డపనేని శ్రీనివాసరావు అక్రమంగా గిఫ్ట్ డీడ్ చేయించుకొని గత నెల 16వ తేదీన తన భార్య యోగమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ రెండు సర్వే నంబర్లలో ఉన్న స్థలంతో పాటు రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్డు స్థలాన్ని కూడా గత నెల 22వ తేదీన తన భార్య పేరుతో మరో రిజిస్ట్రేషన్ చేసిన విషయం పాఠకులకు విదితమే. 58 సర్వే నంబర్‌లో ఉన్న తన స్థలం కూడా కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆ స్థల దారుడు ఖాదర్‌బాషా రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ స్థలాలపై దర్యాప్తు జరపాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు త్రివినాగ్ సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్‌బాషా, పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, సర్వేయర్ దిలిప్, వీఆర్వోలను విచారించారు. ఆ స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేందుకు ప్రధాన సూత్రదారి తహసీల్దార్ బాలకిశోర్ సెలవుపై వెళ్లడంతో ఆయన్ను తర్వాత విచారించనున్నట్లు తెలిసింది. తహసీల్దార్ స్థలాలను ధ్రువీకరిస్తేనే తాము రిజిస్టర్ చేశామని సబ్ రిజిస్ట్రార్ పేర్కొన్నట్లు, తహసీల్దార్ సంతకాలు చేయమంటేనే తాము చేసినట్లు రెవెన్యూ కార్యదర్శి, సర్వేయర్, వీఆర్వోలు చెప్పినట్లు తెలిసింది. తహసీల్దార్ ధృవీకరిస్తే రిజిస్ట్రేషన్ చేయాలన్న రూల్ ఎక్కడ ఉందో తనకు చూపించాలని సబ్ రిజిస్ట్రార్‌ను సబ్ కలెక్టర్ ప్రశ్నించినట్లు తెలిసింది. విచారణకు ముందుగా సర్వే నంబర్లు 58, 58/1, ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆ స్థలాలకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మల్లికార్జునరాయుడు ఉన్నారు.

చిల్లకంపతో రాకపోకలకు అవస్థలు


రోడ్డు పక్కన పెరిగిన చిల్లకంప

పెద్దారవీడు: పెద్దారవీడు నుంచి సిద్ధినాయునిపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా చిల్లకంపతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం సిద్ధినాయునిపల్లి నుంచి మండల కేంద్రం పెద్దారవీడు గ్రామానికి ద్విచక్ర వాహనం, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప ఏపుగా పెరిగి మూసుకు పోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎదురు ఎదురుగా వచ్చే వాహనచోదకులు పక్కకు తొలగే సమయంలో చిల్లకంప కళ్లకు, ముఖానికి తగిలి గాయాలవుతున్నాయని వాపోతున్నారు. మూలమలుపుల వద్ద అధికంగా చిల్లకంప పెరడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మూలమలుపుల వద్ద చిల్లకంపను తొలగించాలని మండల అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. రాత్రిపూట ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలంటే ఎన్నో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా, మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన చిల్లకంపను తొలగించి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం


వధూవరులతో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నపూస మస్తాన్‌రెడ్డి కుమారుడు మహేష్‌రెడ్డి వివాహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తొలుత కుటుంబ సభ్యులు బూచేపల్లికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవదానం, రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు నాగమల్లేశ్వర్‌రెడ్డి, సర్పంచులు సుబ్బారావు వలి, గుంటి గంగ దేవస్థానం మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, యలమందా రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా అవతరణ దినోత్సవం


సరస్వతీ దేవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని తూర్పు చౌటపాలెంలో జిల్లా అవతరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. యూటీఎఫ్ సంకలనం చేసిన మోడల్ టెస్ట్ పేపర్లను ఏకేఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అట్లూరి రామారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో నాడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు కూడా ఒకరని చెప్పారు. పట్టుదల, కార్యదీక్షతో న్యాయవాద పట్టభద్రుడై స్వాతంత్ర్య పోరాట పటిమ కలిగిన ఉద్యమనేతగా రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. కార్యక్రమంలో ఐఈఎఫ్ రాష్ట్ర నాయకుడు ఆల్‌ఫ్రెడ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కురిచేడు: స్థానిక దొనకొండ రోడ్డులోని నాగార్జునసాగర్ కాలువ వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి స్పృహ కోల్పోయిన మహిళ సోమవారం మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన దద్దాల పెద్ద లక్ష్మమ్మ తన భర్త యోగయ్య ద్విచక్ర వాహనంపై పొట్లపాడు వెలుతూ ఆదివారం ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో తొలుత స్పృహ కోల్పోయింది. ఆమెకు 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుంటూరు వెళ్లాలని సూచించడంతో గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్సై శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతూ మృతి చెందిన పెదలక్ష్మమ్మ

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ముండ్లమూరు (దర్శి): పేదలకు పంపిణీ చేయాల్సిన 70 బస్తాల రేషన్ బియ్యాన్ని డీలర్ల నుంచి కార్డుదారులకు పంపిణీ చేయకముందే మినీ లారీలో పక్కదారి పట్టిస్తుండగా ముండ్లమూరు ఎస్సై నాగరాజు వలపన్ని పట్టుకున్నారు. రేషన్ లారీ, డ్రైవర్‌లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు.. 70 బస్తాల బియ్యాన్ని మినీ లారీలో వినుకొండకు తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు తమ్మలూరు గ్రామం వద్ద లారీని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత పట్టుకున్న మినీలారీ వ్యవహారం సాయంత్రం ఐదుగంటల వరకు బయటకు పొక్కనీయ లేదు. పోలీసులు పట్టుకున్న బియ్యాన్ని వెంటనే రెవెన్యూ అధికారులకు అప్పజెప్పి కేసు నమోదు చేయడం అందరికీ తెలిసిన విషయమే. అయితే డీటీ రాధాకృష్ణను బియ్యం ఎక్కడ పట్టుకున్నారని విలేకరులు ప్రశ్నించగా తనకేమీ తెలియద చెప్పడం గమనార్హం. డీటీతో పాటు తహసీల్దార్ లక్ష్మీనారాయణ కూడా ఇదే సమాధానం చెప్పారు. దీనికి తోడు మండలంలో అన్నీ షాపులు తనిఖీలు చేశామని, ఎక్కడా తేడాలు లేవని డీటీ అడగకుండానే సమాధానం ఇవ్వడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. విలేకరులు సమాచారం అడిగితే తననే ప్రశ్నిస్తున్నారు ఎందుకు ..? తనను బెదిరిస్తున్నారా..? మీరు నన్నేం చేస్తారు.. అంటూ వ్యంగ్యంగా అన్నారు. అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయని డీటీ చెప్పడంపై విలేకరులు సైతం ముక్కున వేలేసుకున్నారు. మండలంలో ప్రతినెలా పేదలకు బియ్యం ఇవ్వకుండా వారి వద్ద వేలి ముద్రలు వేయించుకుని రూ.10లు ఇచ్చి పంపుతున్నారని చెప్తున్నారు. తమకు బియ్యం కావాల్సిందే అని పట్టు బట్టిన వారికి కంప్యూటర్ కాటాలు వేసి పది కేజీలకు మూడు కేజీలు బియ్యం తగ్గించి ఇస్తున్నారని కార్డు దారులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మండలంలో 31 రేషన్ షాపులు ఉండగా 29 రేషన్ షాపుల్లో ఆటోల ద్వారా బియ్యం ఇస్తుండగా మండలంలోని ముండ్లమూరు, పెద్దరావిపాడు గ్రామాల్లో మాత్రం డీలర్ల వద్దకే వెళ్లి బియ్యం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆటోల్లో బియ్యాన్ని పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక


ముండ్లమూరు: పాస్టర్‌ల నూతన కమిటీ


ఏసుదాసును సత్కరిస్తున్న పాస్టర్‌లు

దర్శి: దర్శి రీజియన్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ నూతన రీజనల్ కమిటీని శివరాజనగర్ బేతేలు ప్రార్థనా మందిరంలో సీనియర్ పాస్టర్ ఎం.నిరీక్షణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజనల్ ప్రెసిడెంట్‌గా గల్లెపోగు ఏసుదాసు, ఉపాధ్యక్షుడిగా జీఎస్ పాల్, కార్యదర్శిగా పి.బాబన్న, జాయింట్ సెక్రటరీగా తానంచింతల ప్రభుదాస్, ట్రెజరర్‌గా గంథం ఏసుదాసు, కార్యవర్గ సభ్యులుగా బూదాల నాయుడుబాబు, జి. దానియేలు, యగ్గోని కోటి, జి.వెంకట్రావు, సీహెచ్ మరియబాబు, గౌరవ సలహాదారులుగా బత్తుల సుజ్ఞాన్‌రావు, పి.గ్లాడిస్టన్, జి.కోటయ్య, వై.ఆశీర్వాదం, ఎం.యోహానులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఏసుదాసును పాస్టర్‌లు దేవప్రసాద్, తదితరులు ఘనంగా సత్కరించారు.

గ్రేస్ పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక

ముండ్లమూరు (దర్శి): దర్శి మండల గ్రేస్ పాస్టర్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. మండలంలోని బసవాపురం ఎన్‌సీటీఎం చర్చిలో సోమవారం పాస్టర్‌ల ప్రత్యేక సమావేశం దర్శి అధ్యక్షుడు జి.కృపానందం, ఎన్. ఏసన్న అధ్యక్షతన నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా జి.పౌలు, వైస్ ప్రెసిడెంట్‌గా గర్నెపూడి లివింగ్ స్టన్, సెక్రటరీగా మల్లెల యోహాను, జాయింట్ సెక్రటరీగా గొంగటి రాజేష్, ట్రెజరర్‌గా బి. ప్రభుదాస్, గౌరవ అధ్యక్షులుగా మేకా లూకాబాబు, బండి మార్క్, ముఖ్య సలహాదారులుగా గజ్జ రాజారత్నం, గోన దానియేల్, రికార్డింగ్స్ సెక్రటరీ కొమ్ముల యోహానులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృపాదానం మాట్లాడుతూ దైవసేవకులు ఐక్యంగా ఉండి దేవుడు చూపిన మంచి మార్గంలో నడిపించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.


భక్తులకు దర్శనమిస్తున్న భద్రావతి, భావనారుషి స్వామివార్లు


ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు


స్వామివారి ఆలయం వద్దకు 108 కలశాలతో వస్తున్న మహిళా భక్తులు

భక్తిశ్రద్ధలతో భావనారుషి తిరునాళ్ల

చీమకుర్తి: పద్మశాలీయుల కుల దైవం భద్రావతి సమేత భావనారుషి స్వామి తిరునాళ్లను సోమవారం చీమకుర్తిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న తిరునాళ్లలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని భద్రావతి సమేత భావనారుషి ఆలయంలోని స్వామివార్లను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం 108 కలశాలతో గాంధీనగర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి భావనారుషి ఆలయం వరకు మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా వచ్చారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొంతు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జట్ల మురళీధర్, కమిటీ నిర్వాహకులు తాటికొండ వెంకట సుబ్బారావు, వాసి వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, దొంతు సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.